క్లుప్తంగా

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వార్షిక మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. సేవాసమితి సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. అర్చకులు ఆర్.శ్రీనివాసమూర్తి, కిరణ్, సురేష్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు. వైకుంఠపురం దేవస్థానం మాజీ చైర్మన్ పుప్పల వరదరాజులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, పంచముఖ ఆంజేయ సేవా సమితి అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వన్‌టౌన్ పీఎస్ పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ బి.జనార్ధనరావు బుధవారం పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడి విధి నిర్వహణలో పాటించల్సిన అంశాను వివరించారు. వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తెనాలి: ది తెనాలి పీఅండ్‌టీ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా బీఎస్ఎన్ఎల్ జేఈ బైరబోయిన శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తపాలశాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో శ్రీనివాసరావు ఎన్నికైనట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలో నడుస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేడ్-1 గ్రంథాలయాధికారి కె.రమాదేవి కోరారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 6-10 తరగతుల విద్యార్థులకు నీతికథలు, నీతిపద్యాలు, ప్రముఖల జీవితచరిత్రలు బోధించటంతోపాటు డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతివిద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. స్థానిక పాఠశాలకు చెందిన హుస్సేన్ మాస్టారు బుధవారం నీతిపద్యాలు, భావాలు నేర్పించారు. పలు ఇండోర్ గేమ్స్ నేర్పించారు. విద్యార్థులకు కథలు చెప్పి, మళ్లీ తిరిగి వారిచేత చెప్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరంలో చేర్పించాలని కోరారు.

కళాకారుడు బాబురావుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం దేవుడు చేసిన మనుషులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం శ్రీకృష్ణతులాభారము చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, డోలక్, తబల విద్వాంసులు కోడూరు బాబురావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పినపాటి రవీంద్ర, వేములమడ వెంకటేశ్వరరావు, తాడిబోయిన సురేష్, ఫణిదపు దుర్గా, కోడూరు సత్యనారాయణ, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా

తెనాలిరూరల్: పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో 2017లో ఇరువర్గాలు ఓ స్థలం విషయమై ఘర్షణ పడి పరస్పర దాడికి పాల్పడ్డారు. చుండూరు పోలీసులు మొత్తం 11 మందిపై పరస్పర కేసులు నమోదు చేశారు. కేసులు బుధవారం విచారణకు రాగా సాక్షాధారాలను పరిశీలించిన రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత, నిందితులకు రూ. 300 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు కేసుల్లో తెనాలి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, రేపల్లె ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పేదల అభివృద్ధికి నిర్విరామ కృషి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- పెదరావూరులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: పేదల అభివృద్ధికి, వారి జీవన విధానాన్ని మెరుగుపర్చేందుకు బాధ్యతతో, నిర్విరామంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం బుధవారం తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో జరిగింది. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారికి గత మూడున్నరేళ్లలో అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెదరావూరు గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు రూ. 19 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో 700 మందికి నివేశన స్థలాలు ఇచ్చామని, అర్హత ఉండి స్థలాలు రాని వారికి త్వరలో ఇస్తామని చెప్పారు. ఏడు రోజుల పాటు గ్రామంలో పర్యటించగా గ్రామస్తులందరూ తమ స్వంత వ్యక్తిలా ఆప్యాయత చూపించారన్నారు. రానున్న రోజుల్లో తెనాలి పురపాలక సంఘంలో కలవనున్న పెదరావూరు అభివృద్ధిని ఎంతో ముందు చూపుతో చేపట్టామని, ఇందుకు గ్రామంలో రెండు జగనన్న కాలనీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో 80 సచివాలయాలు ఉండగా 62 సచివాలయాల పరిధిలో గడప పగడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేశామని, ఆయా సచివాలయాల్లో రూ. కోట్లతో స్థానిక సమస్యల పరిష్కారం కోసం పనులు చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీటీసీ-2 రావూరి ఏసుదాసు, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, రావూరి విజయ్, గొరికపూడి బాలరాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్ ఉన్నారు.

టిడ్కో గృహాల ఆకస్మిక తనిఖీ...

తెనాలిరూరల్: తెనాలి మండలం జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గృహాలను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గృహాలలో నివసిస్తున్న వారు అక్కడ సమస్యలు ఉన్నాయని ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అక్కడకు వెళ్లిన ఆయన గృహ సముదాయాన్ని పరిశీలించారు. నీళ్ల నిలబడుతుండడం, ఇతర సమస్యలను అక్కడి వారు ఎమ్మెల్యేకు వివరించారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు మేకల రవికుమార్, అక్కిదాసు కిరణ్‌కుమార్, కఠారి హరీష్ తదితరులు ఉన్నారు.

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం

- తగిన రుసుముతో డి-పట్టా మంజూరు
- తహసీల్దార్ కె.రవిబాబు



తెనాలి: ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెనాలి మండల తహసీల్దార్ కె.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2019 అక్టోబరు 15 లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని, అనధికారంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని జీవిస్తున్న వ్యక్తులకు భూమిని కేటాయించే పథకాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం 2021లో జీఓ జారీచేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ ఉత్తర్వులకు కొన్ని సవరణలు చేస్తూ గత ఫిబ్రవరి 16న ప్రభుత్వం జీఓ నెం.60 విడుదల చేసిందని తెలిపారు. ఆ ప్రకారం అభ్యంతరం లేని, అనధికారికంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. తమ ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును చెల్లించాలని తెలిపారు. అన్ని అర్హతలు గల దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న అందరికీ వంద గజాల వరకు ఉచితంగా డి-పట్టా మంజూరు చేస్తామన్నారు. పదేళ్లలోపు భూ బదలాయింపు హక్కులు లేకుండా, పదేళ్ల తర్వాత అందుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. 101 గజాల్నుంచి 200 గజాల వరకు బేసిక్ విలువలో 50 శాతం, 201 నుంచి 300 గజాల వరకు 100 శాతం, 301 నుండి 500 గజాల వరకు 150 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 500 గజాలకు మించిన ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టంచేశారు. క్రమబద్ధీకరణ కోసం డిసెంబరు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరు ఇంటికి సంబంధించిన విద్యుత్ కనెక్షను, ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రశీదు, ఇతర ఆధారాలతో గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవిబాబు వివరించారు.

సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి ప్రారంభోత్సవం

దాతల సహకారంతో రూ.2.60కోట్లతో చర్చి నిర్మాణం



చర్చి ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: దాతల సహకారంతో మండల కేంద్రం కొల్లిపరలో రూ.2.60కోట్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చి ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాలు ఒక్కటేనని, మతం మానవునిని మంచివైపు నడిపిస్తుందన్నారు. అందరికీ క్రీస్తు దీవెనలు ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం సంఘ పెద్దలు ఎమ్మెల్యే శివకుమార్‌ను శాలువాతో సత్కరించి మెమొంటోను అందజేశారు. తొలుత ఎమ్మెల్యే శివకుమార్ సంఘ పెద్దలతో కలసి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు, బిషప్‌లు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలు

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు



వైద్యాధికారిణి అనూషకు వైద్య పరికరాలు అందజేస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు

మంగళగిరి: డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లలో కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందించడం ఎంతైనా అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు కొనియాడారు. మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు గణపతి నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.30వేల విలువైన పరికరాలను, కుర్చీలను బుధవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని నివాస గృహాల మధ్య ప్రభుత్వం అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ మెయింటెన్స్‌లో భాగంగా స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ వైద్య పరికరాలను అందించడం ఎంతైనా అభినందనీయమన్నారు. మంగళగిరి రెడ్‌క్రాస్ చైర్మన్ ఇనునూరి అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సుమారు రూ.30వేల విలువైన వైద్య పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి అనూష, సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ రామచంద్రరాజు, స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అనిల్ చక్రవర్తిలకు దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ ఎస్‌ఏ శిలార్, ఈసీ మెంబర్ గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేజండ్ల సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు




మొక్కజొన్న బస్తాలను తరలిస్తున్న సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు

చేబ్రోలు: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి మొక్కజొన్నకు కొనుగోలు చేస్తున్నట్లు చేబ్రోలు మండలం వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల ఆర్‌బీకే-2 పరిధిలో రైతుల నుంచి సేకరించిన 442 బస్తాల మొక్కజొన్నను లారీల ద్వారా తరలించారు. సొసైటీ అధ్యక్షుడు మాట్లాడుతూ క్వింటా మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1962 కన్నా తక్కువకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వేజండ్లకు చెందిన ముగ్గురు రైతులకు చెందిన 221 క్వింటాళ్ల మొక్కజొన్నకు రూ.1962 చొప్పున రూ.4,33,602ను 21 రోజుల్లోపు చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. వేజండ్లలో లోడ్ చేసిన లారీని పెదకాకాని సీడబ్ల్యూసీకి తరలించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలలోనే మొక్కజొన్న విక్రయించుకోవాలి

వల్లూరు(కాకుమాను): ఈఏడాది రబీ సీజన్‌లో జొన్న, మొక్కజొన్న సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనే విక్రయించుకుని కనీస మద్దతు ధర పొందాలని ఏవో కె.కిరణ్మయి తెలిపారు. మండలంలోని వల్లూరులో బుధవారం పలువురు రైతుల నుంచి 325 క్వింటాళ్ల మొక్కజొన్నల్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ జొన్న, మొక్కజొన సాగుచేసిన రైతుల్ని ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 1190 క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. క్వింటాకు రూ.1962 చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



నాట్కో సంస్థ ప్రతినిధులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతోపాటు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో బుధవారం నాట్కో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పేరెన్నికగన్న నాట్కో ఫార్మా సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 30 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల్ని సంస్థ హెచ్‌ఆర్ డాక్టర్ పి. రంజిత్, జగన్మోహన్, వి. రామకృష్ణ, ప్రొడక్షన్ హెడ్ ఎ.వి. శ్రీనివాసరెడ్డి, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు.

చలపతి ఇంజినీరింగ్ అధ్యాపకుడికి డాక్టరేట్



నాగభూషణం

గుంటూరు రూరల్: లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దారం నాగభూషణానికి కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆయన 'ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ వైర్ లెస్ మెష్ నెట్‌వర్క్ పర్‌ఫార్‌మెన్స్ యూసింగ్ బయోఇన్‌స్పైడ్ ఆల్గారిథమ్స్' అనే అంశంపై డాక్టర్ గోరవర్ధని, డాక్టర్ కె.ఎస్.ఎస్. మూర్తి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నాగభూషణాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై. సుజిత్, చలపతి విద్యాసంస్థల అధినేత వై.వి. ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిరణ్‌కుమార్, డాక్టర్ కె.వి. రామారావు అభినందించారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఇంద్రజాల అంశాలను ప్రదర్శిస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్

పెదకాకాని: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ సూచించారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీలో గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం బుధవారానికి పదో రోజుకు చేరింది. రంగు కాగితాలతో పువ్వులు, అలంకరణ వస్తువులు, టోపీలు (ఓరిగామి) తయారీని విద్యార్థులకు ప్రసాద్ చూపించడంతో పాటు వారితో చేయించారు. పలు ఇంద్రజాల అంశాల్ని ప్రదర్శించారు. కొంతమంది వ్యక్తులు వీటి వెనుక మాయలు, మంత్రాలున్నాయని చెప్తారని, వాటిని నమ్మవద్దని చెప్పారు. వాస్తవానికి ఇవన్నీ మ్యాజిక్ ట్రిక్కు లేనని, వాటి వెనుక సైన్సు సూత్రాలు దాగున్నాయని వివరించారు. గ్రామానికి చెందిన రిసోర్స్ పర్సన్ గోళ్ల వెన్నెల, లింగంగుంట సాహిత్య విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం చేయించారు. శిబిరంలో 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

తెనాలిరూరల్: యువతి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 22 ఏళ్ల యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్ద ఉంటోంది. మంగళవారం ఇంటినుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు, గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు.

నగదు ఉన్న వాహనం మాయం!

తెనాలిరూరల్: తెనాలిలో నగదు ఉంచిన వాహనం మాయమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం బ్యాంకుకు వెళ్లి సుమారు రూ. 4 లక్షలు విత్‌డ్రా చేసి తన స్కూటీలో పెట్టుకున్నాడు. వాహనంపై కొత్తపేటలో కోర్టుల రోడ్డుకు వచ్చాడు. అక్కడ ఓ దుకాణం ఎదుట వాహనం ఉంచి లోపలికి వెళ్లి తిరిగి వచ్చే సరికి వాహనం కనబడకుండాపోయింది. నలుగురు యువకులు బాధితుడిని బ్యాంకు నుంచి అనుసరిస్తూ వచ్చి చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. దీనిపై రాత్రి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని వినతి

తాడేపల్లిరూరల్: ఉపాధి హామీ పథకంలో కూలీలకు బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం విన్నవించారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలోని 18 గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు వారాల వేతన బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి. శ్రీరాములు, ఎం.సాంబశివరావు, అమ్మిరెడ్డి, వి.సాంబశివరావు పాల్గొన్నారు.

ఆశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



గుంటూరు రూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నల్లమోతు రామారావు కోరారు. నగర శివారు గోరంట్లలోని కార్మెల్ విభిన్న ప్రతిభావంతులు, మానసిక వికలాంగుల ఆశ్రమానికి నెల రోజలకు సరిపడా నిత్యావసర సరుకులు బియ్యం, కూరగాయలు, పప్పులు, నూనె తదితర వస్తువుల్ని సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు సంస్థ సభ్యుడు జలీల్ అహ్మద్ పేదలకు సాయం చేసేందుకు ముందుకు వచ్చి నిత్యావసర సరుకులు అందజేసినందుకు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రమణబాబు, రమణ పాల్గొన్నారు.

నాణ్యత, సులువైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

చేబ్రోలు: నాణ్యత, సులువైన బోధనతో విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని ఎన్ఐటీ రూర్కేలా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఉమామహేశ్వరరావు సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ అఫైర్స్ ఆఫీస్ ఆధ్వర్యంలో బుధవారం "అట్రిబ్యూట్స్ ఆఫ్ గుడ్ టీచింగ్ ఇన్ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్" అనే అంశంపై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ప్రొఫెసర్ కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తప్పులు చేసినప్పుడు వారిని దండించకుండా సున్నితంగా తెలియజేసి సన్మార్గంలోకి తీసుకురావాలని సూచించారు. బోధనను కష్టంగా కాకుండా ఇష్టంతో చేసినప్పుడే ఉత్తమ ఫలితాల్ని అందుకోగలమని తెలిపారు. ఉన్నత వ్యక్తిత్వం, జ్ఞానం, పరిశోధనలపై ఉత్సాహం దిశగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని చెప్పారు. మూసధోరణిలో బోధించడం వల్ల విద్యార్థులకు బోరు కొడుతుందని, పరిధిని దాటి సులువైన పద్ధతుల కోసం ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

విత్తన గుళికలతో పలు ఉపయోగాలు



విత్తన గుళికలు తయారు చేసే విధానం గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్

పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తన గుళికలు తయారు చేసుకోవడం వల్ల పలు ఉపయోగాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయం మండల రిసోర్స్ పర్సన్ చింతా వరప్రసాద్ తెలిపారు. విత్తన గుళికలు తయారు చేయే విధానం గురించి బుధవారం సాయంత్రం మండల పరిధిలోని రావిపాడు, గొరిజవోలుగుంటపాలెం గ్రామాలలో రైతులకు అవగాహన కల్పించారు. వరప్రసాద్ మాట్లాడుతూ విత్తన గుళికలు పురుగులు పట్టకుండా, చీమలు, పక్షులు తినకుండా భూమిలో ఉండి వర్షం పడిన వెంటనే మొలకలు ఎత్తుతాయని తెలిపారు. మొలకెత్తిన తర్వాత 45 రోజులకు భూమిలో కలియదున్నడం వల్ల భూమికి మంచి పోషకాలు లభిస్తాయని, తద్వారా దిగుబడులు ఎక్కువగా సాధించవచ్చని సూచించారు. విత్తన గుళికలు రైతుభరోసా కేంద్రాలో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మంచి మెజీషియన్లుగా తయారు కావాలి



మ్యాజిక్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్
- ముగిసిన మ్యాజిక్ శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: బాలలు భవిష్యత్‌లో మంచి మెజీషియన్లుగా తయారు కావాలని ప్రముఖ మెజీషియన్ క్రాంతికార్ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన మ్యాజిక్ శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ సుమారు 10 రకాల మ్యాజిక్ ట్రిక్కులు పిల్లలు నేర్చుకున్నారని వివరించారు. 13 రోజుల నుంచి అత్యంత క్రమశిక్షణతో మ్యాజిక్‌లో శిక్షణ పొందిన పిల్లలను అభినందించారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ విజయవాడ రాఘవయ్య పార్క్ వద్ద ఉన్న ఎంబీ విజ్ఞాన కేంద్రంలో 13 రోజుల పాటు నేర్చుకున్న వివిధ రకాల మ్యాజిక్‌ను బాల మెజీషియన్లు అందరి సమక్షంలో ప్రదర్శిస్తారని అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

జడవల్లి(చేబ్రోలు): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన సంఘటన పొన్నూరు మండలం జడవల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన గూడూరి సురేష్‌బాబు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని దుస్తులు, సామగ్రితో పాటు పలు ధ్రువీకరణ పత్రాలు కాలిబూడిదయ్యాయి. నిరుపేద కుటుంబానికి చెందిన సురేష్‌బాబు కట్టుబట్టలతో మిగిలాడు. గ్రామ సర్పంచ్ ఇందిరా ప్రియదర్శిని నిత్యావసర వస్తువుల్ని అందించారు. పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేశారు.

గుర్తు తెలియని యువకుడి మృతి



గుర్తు తెలియని యువకుని మృతదేహం

మంగళగిరి: నగరంలోని ఆటోనగర్ వద్ద ప్రధాన రహదారిపై ఓ గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. సుమారు 28-30 ఏళ్ల కలిగిన గుర్తు తెలియని యువకుడు నగరంలోని ఆటోనగర్ సమీపంలోని ప్రధాన రహదారి వద్ద మద్యం మత్తులో పడి ఉన్నట్లు స్థానికులు బుధవారం సాయంత్రం సమాచారం అందించినట్లు తెలిపారు. ఘటనా ప్రాంతానికి చేరుకోగా అప్పటికే గుర్తు తెలియని యువకుడు మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా మృతుడు ముక్కుపొడి కలరులో ఉన్న గళ్ల ఫ్యాంటు, తెలుపు, నలుపు, పాచి కలరు కలిగిన టీషర్టు ధరించి ఉన్నాడని, యువకుని ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.